నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి అందుబాటులో ఉంటుందన్నారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్ డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఆయా ఫిర్యాదులపై అక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

27న కట్ట మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: బుద్వేల్ టీచర్స్ కాలనీలోని కట్ట మైసమ్మ ఆలయ 5వ వార్షికోత్సవాన్ని ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గణపతి పూజ, పుణ్యాహ వచనం, లలితా సహస్రనామ పారాయణం, సప్తశతి హోమ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 8 గంటలకు పంచ హారతి, ఓంకార భజన మండలి సభ్యులతో భజన కార్యక్రమాలు, 8.30 గంటల నుంచి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ వార్షికోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వేడుకగా వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని వీరభద్రస్వామి భద్రకాళి ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా దేవాలయాన్ని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ఉదయం అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులకు వీరభద్ర స్వామి భద్రకాళి అమ్మవారి దర్శనాన్ని ప్రారంభించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా తగు ఏర్పాట్లు చేపట్టారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాస్త్రీపురం కాలనీలోని ప్లాస్టిక్ చైర్ పరిశ్రమంలో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంటలను గమనించిన స్థానికులు అగ్నిపమాక, పోలీసులకు సమాచారం అందించారు. రాజేంద్రనగర్, చందులాల్ బారాదారి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదం జరిగినప్పుడు పరిశ్రమలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.

బంగారు బోనానికి పూజ



గోల్కొండ: గోల్కొండలోని జగదాంబిక మహంకాళి అమ్మవారికి సేవ చేయడం నా అదృష్టమని ఆలయ వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి అన్నారు. సాయిబాబాచారి కుటుంబం తరఫున ఈ నెల 26న మొదటి బోనం పూజ సందర్భంగా అమ్మవార్లకు సమర్పించనున్న బంగారు బోనానికి ఆదివారం రిసాలబజార్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..వంశపారపర్యంగా అమ్మవారికి పూజలు చేస్తున్నామన్నారు. అమ్మవారిపై ఉన్న భక్తితో తమ కుటుంబం తరఫున మొదటిసారిగా బంగారు బోనం అమ్మవారికి సమర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, శివాచారి, వృత్తిపని సంఘం ఉపాధ్యక్షుడు బి.శ్రీకాంత్ తదితరులున్నారు.

డ్రైనేజీ నిర్మాణం.. అస్తవ్యస్తం..!

- డ్రైనేజీ పనుల్లో నాణ్యతాలోపం
- రెండు రోజులకే గుంతలుగా మారిన వైనం
- ప్రమాదాల బారిన వాహనదారులు
- అధికారుల తీరుపై ప్రజాగ్రహం



శంషాబాద్ ప్రధాన రహదారిలో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ పనులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణ ప్రధాన రహదారిలో చేపట్టిన డ్రైనేజీ పనులు.. మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ వెళ్లే రహదారిలో రైల్వే కమాన్ వద్ద ప్రధాన మార్గంలో డ్రైనేజీ లైను కలిపేందుకు రెండు రోజుల క్రితం పనులు చేపట్టారు. పైపులు వేసిన తర్వాత దానిని రహదారికి సమాంతరంగా కాకుండా చాలా ఎత్తులో సిమెంట్ పనులు చేశారు. దీంతో పైపులపై వేసిన సిమెంట్ వల్ల అది కాస్తా ఎత్తైన స్పీడు బ్రేకర్‌లా తయారైంది.

- ఇది ఒక ఎత్తైతే నాణ్యత లేకుండా నిర్మించినందున గడచిన దానిపై రంధ్రాలు ఏర్పడ్డాయి. ఈ కారణంగా రెండు రోజుల్లోనే అదికాస్తా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కల్గిస్తోంది. కింద ఉన్న డ్రైనేజీ బయటపడేలా కనిపిస్తోంది. ఈ ప్రాంతంలో వేగంగా వచ్చే వాహనాలు ఎత్తుగా ఉండటంతో ఒక్కసారిగా బ్రేక్ వేయాల్సి వస్తుండటంతో తరచూ ప్రమాదాలూ చోటుచేసుకుంటున్నాయి.
- ఇకనైనా మున్సిపల్ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి నాణ్యత లేమితో చేపట్టిన పనులను వెంటనే సరిద్దాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.
- ఈ ప్రాంతంలోనే ఆరు నెలల క్రితం బస్టాప్ ఏర్పాటు చేశారు. అప్పట్లో మిగిలిన మట్టి, రాతిపొడర్ ఇతర వ్యర్థాలను అక్కడే వదిలేశారు. అవి పూర్తిగా గట్టిపడిపోయాయి. కొంతకాలంగా రహదారికి అడ్డుగా ఉన్నందున రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా మున్సిపల్ అధికారులు మాత్రం దానిని తొలగించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

సరిదిద్దుతాం

ఔట్ లెట్‌కు సమాంతరంగా ఉన్న కారణంగా రోడ్డుకన్నా ఎక్కువ ఎత్తులో డ్రైనేజీని నిర్మించాల్సి వచ్చింది. వ్యర్థాలను వెంటనే తొలగించి.. మిగిలిన పనులను పూర్తిచేసి రోడ్డును సరిదిద్దుతాం. వాహనదారులు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– నరేష్, ఏఈ శంషాబాద్ మున్సిపాలిటీ

రసవత్తరంగా శ్రీరాంనగర్ ఎన్నికల పోరు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంనగర్ (సెక్రటేరియట్ కాలనీ) సంక్షేమ సంఘం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 29వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. పుర పాలక సంఘం పరిధిలోని పెద్ద కాలనీల్లో అది ఒకటి కావటం, అధ్యక్షుడిగా ఎన్నిక కావాలని ఐదుగురు బరిలో ఉండటంతో పోటీ రసవత్తరంగా మారింది. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆదివారం స్క్రూటినీ పూర్తయింది. పోటీలో ఉన్న సభ్యుల పేర్లను ప్రకటించారు. ఎక్కువగా నామినేషన్లు వేసిన విభాగంలోని పోటీదారులు సోమవారం రాత్రి 8 గంటల లోపు ఉపసంహరించుకునే సమయం ఇచ్చారు. అధ్యక్ష స్థానం కోసం ఐదుగురు, మూడు ఉపాధ్యక్ష పదవులు కోసం ఐదుగురు, ఒక ప్రధాన కార్యదర్శి పదవికి ఇద్దరు, ఒక కోశాధికారి పదవికి నలుగురు పోటీలో ఉన్నారని ఎన్నికల అధికారి పీయూవీ సుబ్బారావు తెలిపారు. మిగతా ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవులు రెండు ఉండగా ఎ. విజయ్‌కుమార్, ఎస్, సునీత రెడ్డి, కల్చరల్ సెక్రటరీ ఒక పదవి ఉండగా బి. రామమోహన్‌రావు, జాయింట్ సెక్రటరీ పదవులు రెండు ఉండగా సీహెచ్ వీఎస్.జగన్నాథరావు, పి.సుజాతలు నామినేషన్లు వేయటంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశమే ఉందని వివరించారు. కార్యవర్గ సభ్యుల పదవులు పది ఉండగా 9 మంది మాత్రమే నామినేషన్లు వేయటంతో వారు ఏకగ్రీవం అవుతారన్నారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణలో ఏ పదవికి నిర్ణీత సంఖ్య కంటే ఎక్కువగా ఉంటే ఈ నెల 29వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి వివరించారు.

అ'పూర్వ' సమ్మేళనం



హాజరైన పూర్వ విద్యార్థులు

శంషాబాద్ రూరల్: ఒకే పాఠశాలలో చదువుకుని.. పాతికేళ్ల తర్వాత కలుసుకునేందుకు దేశ, విదేశాల నుంచి తరలివచ్చారు. మరికొందరు వీడియో కాల్‌తో నాటి జ్ఞాపకాలను నెమరువేసున్నారు. వివరాలివీ... రామంజాపూర్‌లోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1999–2000వ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండలంలోని పెద్దషాపూర్‌లో ఓ రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కొంత మంది ఆస్ట్రేలియా, అమెరియా, ఇంగ్లండ్ దేశాల నుంచి హాజరయ్యారు. మరి కొందరు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి చిన్ననాటి స్నేహితులతో ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు వీడియో కాల్‌లో పూర్వ విద్యార్థులతో మాట్లాడి అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, తెలంగాణ షెడ్యూల్ క్యాస్ట్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ చైర్మన్ ప్రీతం నగరి, ప్రీతి, ఉమేష్, శశిధర్, మృధుల, నవీన్, జహీర్, కిరణ్, నరోత్తం, సరిత, మధుసూదన్‌రెడ్డి, పావని, హిమబిందు, స్వప్న సింగ్, పురుషోత్తం, బోసాని రాజా, రాము, ఇలియట్ రెబల్ సన్ తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవ: భర్త ఆత్మహత్య

రాజేంద్రనగర్: భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లడంతో మనస్థాపం చెందిన భర్త ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు రోజుల అనంతరం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మామిడి కిశోర్ సమాచారం మేరకు... ఉప్పర్‌పల్లి ఫ్రెండ్స్ కాలనీకి చెందిన ఎస్.రాజు(32) తన భార్య ఉమారాణితో కలిసి నివసిస్తున్నాడు. కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత వారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అలిగిన భార్య ఉమారాణి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఇంట్లో వంటరిగా ఉన్న రాజు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు రోజుల క్రితం ఈ సంఘటన జరగడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఆదివారం ఉదయం రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటి తలుపులు బద్దలు కొట్టి చూడగా ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

శాస్త్రీయ కళా రూపాలను ప్రోత్సహించాలి



కళాకారులతో ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ కళా రూపాలను ప్రోత్సహించడం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో బాసర సరస్వతి అమ్మవారికి సంగీత నృత్య నీరాజనం –2025 పేరిట నృత్య ప్రదర్శనలో వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు పాల్గొని కూచిపూడి, భరతనాట్యం, కథక్ వివిధ కళా రూపాల ప్రదర్శనను అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..నేటి పాశ్చాత్య ఆధునిక పోకడలలో శాస్త్రీయ కళా రూపాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కళా రూపాలను భవిష్యత్ తరాలకు అందించడంలో సాంస్కృతిక సంస్థల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం పలువురు గురువులను ఘనంగా సన్మానించడంతో పాటు కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వీరేష్‌యాదవ్, ప్రముఖ కవి డాక్టర్ వేమూరి అనంతర రామకృష్ణ శర్మ, వేమూరి మంజుల, రామ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

'చలన కాంక్ష' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అందెశ్రీ, సుద్దాల అశోక్‌తేజ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉదయ సాహితీ ఆధ్వర్యంలో ప్రముఖ కవి మౌనశ్రీ మల్లిక్ రచించిన 'చలన కాంక్ష'పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా లోక కవి అందెశ్రీ మాట్లాడుతూ.. రచయిత సమాజంలోని పలు అంశాలపై చక్కగా వివరించారని కొనియాడారు. సినీగేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ..వెలుగును వెలిగించే ప్రయత్నం చేసే వారే నిజమైన విమర్శకులు అన్నారు. ఏమైనా తప్పులు ఉంటే చెవిలో చెప్పాలి ఏదైనా మంచి ఉంటే నలుగురిలో చెప్పాలి అని తన చిన్నప్పుడు వాళ్ల అమ్మ చెప్పిన విషయాన్ని నేటికీ పాటిస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ద్యాసం సేనాధిపతి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైసా దేవదాస్, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, కవయిత్రి పద్మకళ, ఉదయ సాహితీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మూర్తి శ్రీదేవి పాల్గొన్నారు.

కొమురవెల్లి మల్లికార్జున స్వామికి పట్టు వస్త్రాల అందజేత



ఈఓ అన్నపూర్ణకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న మధుసూదన్ యాదవ్, సునీత దంపతులు

చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు, పాతబస్తీ హరిబౌలికి చెందిన మల్యాల మధుసూదన్‌యాదవ్, సునీత దంపతులు కొమురవెల్లి మల్లికార్జున స్వామితో పాటు అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించేందుకు ఆలయం ప్రాంగణంలో తయారు చేయించారు. వీటిని ఆదివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం ఈఓ అన్నపూర్ణ, అడిషనల్ ఈఓ శ్రీనివాస్‌కు అందజేశారు. మల్యాల మధుసూదన్‌యాదవ్ కుమారుడు హరేంద్రయాదవ్ జన్మదిన వేడుకల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పిస్తానని చేసిన మొక్కులో భాగంగా అక్కడే తయారు చేయించి ఈఓకు అందజేసినట్లు మధుసూదన్‌యాదవ్ తెలిపారు. వీటిని సోమవారం ప్రత్యేక పూజలతో స్వామి వారితో పాటు అమ్మవార్లకు ధరింపచేయనున్నారన్నారు.

బీజేపీ గచ్చిబౌలి డివిజన్ నూతన కార్యవర్గం

రాయదుర్గం: బీజేపీ గచ్చిబౌలి డివిజన్ నూతన కార్యవర్గాన్ని డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ ఆదివారం ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి నియామకపత్రాలను అందించారు. డివిజన్ ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్‌రెడ్డి, కిషన్‌గౌలి, నరేందర్ యాదవ్ సతీష్‌గౌడ్, శ్యామ్‌లెట్ సంజీవ, దుర్గారామ్, ప్రధాన కార్యదర్శులు బబ్లూసింగ్, సురేందర్‌ముదిరాజ్, కార్యదర్శి దినేష్‌యాదవ్, రంజిత్ పూరి, కోశాధికారి ఉమేష్‌గౌడ్ నియమితులయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఉద్దేశించి రవికుమార్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ అందరూ కలసి కట్టుగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మీన్‌లాల్‌సింగ్, వసంతకుమార్ యాదవ్, రవీందర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

యువత బీజేపీలో చేరిక

గచ్చిబౌలి: మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో మాదాపూర్ డివిజన్ సుభాష్‌చంద్రబోస్ నగర్, కృష్ణ కాలనీ నుంచి 50 మంది యువకులు పార్టీ సీనియర్ నాయకుడు రాధాకృష్ణయాదవ్ బీజేవైఎం నాయకుడు రాముయాదవ్ నాయకత్వంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ బీజేపీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరన్నారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, కన్వీనర్ రాఘవేంద్రరావు పార్టీలో చేరిన వారిని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు విక్కీ, స్వామి, గోవర్ధన్‌రెడ్డి, వసంత్, మధు, అరుణ్, అరవింద్, చందు, కార్తీక్, సాయి, శివ శంకర్, సిద్దు, మోహన్ పాల్గొన్నారు.

మున్నూరు కాపులు సంఘటితంగా ముందుకు సాగాలి

పంజగుట్ట: మున్నూరు కాపులు అందరూ ఒకే కులం, ఒకే సంఘంగా ముందుకు పోవాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఎన్నిక నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 33 జిల్లాల కార్యవర్గం సంఘం అధ్యక్షుడిగా కొండ దేవయ్య పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం అపెక్స్ కౌన్సిల్ రద్దు చేసి, మంత్రివర్గంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు అవకాశం కల్పించాలని తీర్మానం చేశారు.

గంగపుత్ర సంఘం బలోపేతానికి కృషి

గోల్కొండ: గంగపుత్ర సంఘం బలోపేతానికి, సంఘం సభ్యుల అభ్యున్నతికి అందరి సహకారంతో కృషి చేస్తానని షేక్‌పేట్ గంగపుత్ర సంఘం కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన గుర్రం నాగరాజు అన్నారు. ఆదివారం షేక్‌పేట్ గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో సంఘానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా చెర్క గణేష్, ఉపాధ్యక్షుడిగా వి.ప్రభాకర్, వి.మహేందర్, జి.పరమేశ్వర్, సలహాదారులుగా సి.సదానంద్, జి.గోపాల్, పూస వేణుగోపాల్‌రావు, లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మరో ఇద్దరి పరారు

నాంపల్లి: గంజాయి విక్రయిస్తున్న ఓ ఇంటిపై ఎస్‌టీఎఫ్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో ఒకరిని అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారయ్యారు. అరెస్టు చేసిన వారి నుంచి 1.138 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ ఘటన నాంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాన్గార్ బస్తీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మాన్గార్ బస్తీలో గంజాయి విక్రయిస్తున్నట్లుగా సమాచారం రావడంతో దాడులు చేసినట్లు ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ఈ కేసులో కాంబ్లే అరుణ్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు వివరించారు. సాకేత్ రాజు, ఖలీద్ అనే మరో ఇద్దరు పరారైనట్లు తెలిపారు. నిందితుడిని నాంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

జగదానందకారక..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నృత్యదీక్షలయ గురువు లక్ష్మీశంకర్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో జగదానందకారక, జతిస్వరం, గీతరసికే, మండూక శబ్దం, అప్సరసలు, నమశ్శివాయతే, వందే మీనాక్షి, రామాయణ శబ్దం, పరమ పురుషుడు, మంగళం తదితర అంశాలను కళాకారులు ఆద్య, ఆశ్రిత, అమృత, అవంతిక, అవిజ్ఞా, గాయత్రి, వెంకట్, జీవిత, కార్తీక, నందిని, పూర్విక, రితిక తదితరులు ప్రదర్శించారు.

'ఒక చిత్రం ఎన్నో భావాలను పలికిస్తుంది'



చిత్రకళ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో మామిడి హరికృష్ణ, బీఎస్.రాములు తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఒక చిత్రం ఎన్నో భావాలను పలికిస్తుందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పికాసో ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బి హైండ్ ది బ్రష్ చిత్ర కళా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..అద్భుతమైన కళాత్మక చిత్రకళ ప్రదర్శన అని కొనియాడారు. చిత్రకారుల వెనుక ఉన్న సాదక బాదకాలను తెలుపుతూ చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు బైరు రమేష్ మాట్లాడుతూ..ఈ నెల 24వ తేదీ వరకు ఈ చిత్ర కళా ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు, రాష్ట్రపతి నిలయం (బొల్లారం) మేనేజర్ డాక్టర్ కె.రజినిప్రియ, మహిళా హక్కుల న్యాయవాది డాక్టర్ శ్రీదేవి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ డివిజన్ అధ్యక్షుడిగా వేణుకుమార్ మాదిగ



వేణుకుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎంఎస్‌పీ సభ్యులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పీ) అధ్యక్షుడిగా ఫిలింనగర్ గౌతంనగర్ బస్తీకి చెందిన బొప్పారం వేణుకుమార్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫిలింనగర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రుపల్లి శివకుమార్ మాదిగ, ఖైరతాబాద్ కో ఇన్‌చార్జి కండె రామ్‌కుమార్ మాదిగ చేతులమీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా ఇనపనూరి వెంకటేష్ మాదిగను నియమించారు. కార్యక్రమంలో ఫిలింనగర్ 18 బస్తీల ఎమ్మార్పీఎస్ నేతలు, ఎంఎస్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాల జాతరకు ఏర్పాట్లు

- నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న పాతబస్తీ వాసులు
- ఈ నెల 29న బోనాలు.. 30న ఘటం సామూహిక ఊరేగింపు
- 28న పాతబస్తీ నుంచి బయలు దేరనున్న భక్తులు



గతేడాది తుల్జాపూర్‌లో అమ్మవారికి బోనం సమర్పిస్తున్న భక్తులు (ఫైల్)

చార్మినార్: తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాల జాతర ఉత్సవాలను రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించడానికి పాతబస్తీలోని ఉత్సవాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. డబీర్‌పురాలోని పంచదుర్గ ఆలయానికి చెందిన కమిటీ ప్రతినిధులు ఇప్పటికే నూతన కమిటీని ఏర్పాటు చేసుకుని ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. నాలుగేళ్లుగా తుల్జాపూర్‌లో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు. ఈసారి జరిగే ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 29న బోనాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28న డబీర్‌పురా పంచదుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో అధిక సంఖ్యలో తుల్జాపూర్ బయలుదేరి వెళ్లనున్నామన్నారు.

30న అమ్మవారి సామూహిక ఘటం ఊరేగింపు..

తుల్జాపూర్‌లో అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం మరుసటి రోజు భాజాభజంత్రీల నడుమ అమ్మవారి ఘటం సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. దారిపొడవునా పోతరాజు నృత్యాలతో పాటు కళాకారుల డ్యాన్స్‌లు స్థానిక భక్తులను అలరించనున్నారన్నారు. దత్తు తుల్జాపూర్‌లో అమ్మవారి ఘటం నిమజ్జనం ఉంటుందన్నారు.

నాలుగేళ్లుగా బోనాలను నిర్వహిస్తున్నాం..



నాలుగేళ్లుగా తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాలను నిర్వహిస్తున్నాం. భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న బోనాలతో మేమంతా పిల్లాపాపలతో కష్టాలు లేకుండా సుఖశాంతులతో ఉన్నాం. ఆయురారోగ్యాలతో చల్లంగా ఉంటున్నాం. ఎలాంటి సమస్యలు లేవు. కరోన కష్ట కాలం అనంతరం ఏడాది నుంచి తెలంగాణ బోనాలను తుల్జాపూర్‌లో నిర్వహిస్తున్నాం.

– పింజరోళ్ల ఆనంద్, అధ్యక్షుడు